

డి. హనుమంతరావు

ఇది రెండేళ్ళ క్రితం నేఫాలో జరిగిన సంగతి.

అప్పుడు నేను 'సేలా' దగ్గర ఒక యూనిట్ ని కమాండ్ చేస్తుండేవాణ్ని. ఏప్రిల్ నెలయినాగానీ, యింకా మంచు కురుస్తూండేది. విపరీతమైన చలి. పదమూడువేల అడుగుల పైన యెత్తు. బయటి ప్రపంచంతో సంబంధం పెట్టుకోవాలంటే సుమారు రెండు వందల మైళ్ళు కొండదార్లమీద ప్రయాణించాలి. నేఫాలో పర్వతాలన్నీ మన్ను, రాళ్ళు పేర్చిన గుట్టల్లాగ ఉంటాయి. విపరీతంగా వానలుపడ్డం మూలాన దట్టంగా చెట్లుగూడా పెరుగుతాయి. ఒకోసారి ఎక్కువగా వాన పడితే ఆ మన్నుకరిగి రాళ్ళన్నీ క్రిందకి

జారతాయి. అలాగే ఎండ యెక్కువ అయితే, మన్నులో తేమ యిగిరిపోయి, రాళ్ళు పడతాయి. ఇలా రాళ్ళు పడడాన్ని 'లాండ్ స్లైడ్' అంటారు. ఇలాంటి లాండ్ స్లైడ్లలో లారీలు, ట్రక్‌లు వగైరా క్రిందికి కొన్ని వేల అడుగులలోతు లోయల్లోకి కొట్టుకు పోతాయి. అందులో మనుషుల సంగతి అడగక్కరలేదు. మూడు నాలుగు రోజులపాటు రోడ్డు మూసుకుపోయి, బయటిప్రపంచంతో సంబంధంకూడా ఉండదు.

ఆ సాయంకాలం మంచు బాగా కురుస్తోంది. నల్లనిరాళ్ళ మొనలు తెల్ల ముసుగు వేసుకుంటున్నాయి. బంకర్లో 'బుఖారి' ప్రక్కన కూర్చొని రాధ నుంచి వచ్చిన ఉత్తరం చదువుతున్నాను.

కరంసింగ్ కిరసనాయిలు జెర్రికాన్ మార్చి, బుఖారిలో మంటని పెంచిస్తూ అన్నాడు –

"టామీ సాయంత్రంనుంచి కనబడ్డం లేదు, సర్! యీ మంచులో ఎక్కడికి పోయిందో!"

"లైన్సులో చూశావా?"

"అంతటా వెతికాను. అలా క్రిందికి పోతుంటే చూశాట్ట చవాన్!"

నాకు వెంటనే తట్టింది. రెడ్డికి టామీకి అవినాభావ సంబంధం. అక్కడికే పోయుంటుంది.

"ఒకసారి అలా క్రిందికి పోయొద్దాం. జీప్పని తీసుకురమ్మను"

కరంసింగ్ బయటికి వెళ్ళాడు

"వెర్రిగా ప్రతీ సాయంత్రం మీ నుంచి ఉత్తరం వస్తుందేమోనని ఎదురు చూస్తుంటాను. నా పిచ్చిగాకపోతే, రోజూ యెక్కడ్నించి వస్తుంది? ఐనా ఏమో, యేళ్ళనాన్నో నేను గుర్తుకొస్తే ఓ నాలుగుముక్కలు గీకిపారేస్తారేమోనని ఆశ! మనపెళ్ళి అయిన క్రొత్తలో, గుర్తుందా! ప్రొద్దునొకటి, సాయంకాల మొకటి అన్నట్టు, నా నుంచి జవాబుల్తో నిమిత్తం లేకుండా వ్రాసి పడేశేవారు!

"ఆ ఆరాటమంతా ఏమైపోయిందో యిప్పుడు! మీ ఉత్తరంకోసం యిలా ప్రతీపోస్టూ ఆత్రుతగా గుండె బిగబట్టి యెదురుచూసే వాళ్ళున్న సంగతే గుర్తున్నట్టులేదు. ఇలా వ్రాస్తుంటే, యేమిటింత దూరాన్నుంచే సాధించేస్తోంది అని కోపంవస్తోంది. అవునా! ఇంకేం వ్రాయనులెండి! అయినా, మీకు ప్రతీ చిన్నవిషయానికి కోపమే! మొదట్లో, యింత కోపమయితే కాపరమెలాగ అనిపించేది!..."

రాధ ఉత్తరంలో. లగ్నమైన నా ఆలోచనలకి అంతరాయం కలిగిస్తూ హవల్దార్ మేజర్ కాళ్ళతో నేల అదిరేలాబాది 'సావధాన్'లో నిలబడి సెల్యూట్ చేసి కంపెనీలో అంతా సరిగా

ఉన్న వైనం తెలియపరిచాడు. ప్రతీ సాయంత్రం 'రోల్ కాల్' తర్వాత అలా రిపోర్టివ్వడం అతని డ్యూటీ.

"క్రిందకి వెళ్ళిన ట్రక్ యింకా రాలేదు సార్. దార్లో లాండ్ స్లైడ్ జరిగిందిట. ఇదివరకటికన్నా చాలా పెద్దది. రోడ్డంతా పూర్తిగా కొట్టుకు పోయింది. ఇవాళ పోస్టు కూడా రాలేదు."

"యెక్కడ? ఇదివరకటి చోటేనా?"

"అవును సార్. టూమీ అటు పోతుంటే చూశారట." హవల్దార్ మేజర్ నోటితో చెప్పకపోయినా, అతనికళ్ళలో ఏదో భయంలాంటి సూచన ఉంది.

"అందుకే, జీపు తీసుకురమ్మన్నాను. తాళ్ళు, కర్రలు, పలుగు, పార, జవానులు అన్నీ సిద్ధంచెయ్యి."

"రైట్ సార్" హవల్దార్ మేజర్ వెళ్ళిపోయాడు.

రాధ యెప్పుడూ ఆరేడు పేజీలకి తక్కువ ఉత్తరం వ్రాయదు. చదవా లంటే ఒక్కసెషన్లో పూర్తిగాదు.

"మొన్న రాత్రి పూర్ణిమ, వెన్నెల బాగా కురిసింది. చిన్న చిన్న మబ్బు తునకలు గుంపులుగా ఆకాశాన్నీదుతున్నాయి. వాటి కొసల్ని వెలిగిస్తోంది వెన్నెల. దొడ్లో సన్నజాజులు విరబూశాయి. ఆ జాజిపందిరి క్రింద చాపేసుక్కూచుని ఏమిటో ఆలోచిస్తున్నాను. అప్పుడే ఆరునెలలయింది మీరు, నేను అలా అక్కడ కూర్చొని. ఆ రాత్రి అలా మీద రాలిన జాజుల్ని దండగుచ్చనివ్వకుండా ఒక్కొకటొక్కటే తలలో అక్కడా యిక్కడా అమర్చారు! ఆనాటి ఆలోచనలు నేమరేసుకుంటూంటే, యేమిటో సిగ్గు, బాధ, గర్వం, సంతోషం, దిగులు! అలా కూర్చోనలేక చాపమీద వాలిపోయాను!

"దూరంగా రేడియోలోనుంచి చక్కనిపాట వస్తోంది, 'నీవు రావు, నిదుర రాదు' అంటూ! భరించలేని ఆందోళన గుండెని నులుముతున్నట్టయింది. యీ ఆరు నెలలు ఆరేళ్ళో ఆరు యుగాలో అయినట్టుంది. నాకు తెలియకుండానే కళ్ళలో నీరు నిండింది. 'కలలైన నిన్ను కనులచూతమన్న, నిదుర రానినాకు, కలలు గూడ రావు!' అంటోంది రేడియోలో ఒకమ్మనిగొంతు! ఆ పాటలన్నీ నాగురించే వ్రాశారేమో అన్నట్టనిపించసాగింది..."

"జీపువచ్చింది, సార్!" కరంసింగ్ చెప్పాడు.

నేను బయల్దేరాను. బయటికి వచ్చే సరికి చలిగాలి మొగంమీదకొట్టి మంట పుట్టింది. ఒంటిని బట్టలు ఎన్ని వేసుకున్నా, మొగం చలికి బిగుసుకుపోక తప్పదు.

రెండేళ్ళ క్రితం ఏదోపనిమీద అటు వెళ్ళినప్పుడు "మోన్పా" లకి ఓ రమ్

బాటిల్ యిచ్చి కొన్నాను. అప్పుడు బొత్తిగా చిన్నది టామీ. మొదట కొద్దిరోజులు, 'కుంయ్' 'కుంయ్' మని యిరవై నాలుగ్గంటలూ ఏడుస్తూనే ఉన్నా క్రమేపీ అలవాటుపడింది. నాకన్నా యెక్కువగా రెడ్డిదగ్గర. రెడ్డి కరంసింగ్‌కి ముందు నా దగ్గర 'ఆర్డర్లీ'గా ఉండేవాడు.

మాయూనిట్లో రెడ్డి ఒక్కడే తెలుగువాడు. మిగతా అంతా మరాఠీలు, సిక్కులు. చేరినక్రొత్తలో ఓ ఆదివారం మధ్యాహ్నం, గట్టిగా "రావోయి బంగారిమామా!" అంటూ తెలుగుపాట వినబడుతూంటే పిలిపించాను రెడ్డి నా యూనిట్లో వాడే అని తెలిశాక నా కేమిటో తృప్తిగా అన్పించింది. ఆతరువాత అతన్నే నా దగ్గర ఆర్డర్లీగా పంపించాడు సుబేదార్.

సైన్యంలో ఆర్డర్లీ అంటే మామూలుగా అనుకునేట్టు నౌకరు అనిగాదు. అతను పక్కవెయ్యడం, బూట్ పాలిష్ చెయ్యడం, నీళ్ళు కాచివ్వడం వగైరా చేసినా, ఒకవిధంగా సలహాదారు, సహాకుడు లాంటివాడు. అందుకే మామూలుగా ఒకనౌకరుగా కాక, స్నేహితుడు అయినట్టు చూస్తారు. ఆఫీసరుకి 'బాట్ మన్' అంటే కంపెనీలో అందరికీ గౌరవం.

రెడ్డి నా దగ్గరజేరాక, నాకేవిషయంలోను యిబ్బంది అనేది లేకుండా పోయింది. ముఖ్యంగా బయటి చోట్లకి కాంప్‌కి వెళ్ళినప్పుడు యిదివరకట్లో లాగనే నేం చూసుకోనక్కర లేకుండా నా విషయాలన్నీ అతనే శ్రద్ధ తీసుకొని అన్నీ చక్కబర్చేవాడు.

రెడ్డి టామీని బాగా మచ్చికజేశాడు. టామీ అతన్ని ఒకక్షణం వదిలేదిగాదు. దానికి రోజూ సబ్బుతో స్నానం. ఎట్టి పరిస్థితుల్లో నయినా ప్రొద్దున్నా, సాయంకాలం బిస్కట్లు, పాలు తప్పవు. అవి అతనే యివ్వాలి. దాని వొంటి మీద వెంట్రుకలు శుభ్రపరచడానికి ఓ బ్రష్‌కొన్నాడు. నేల మీద పడుకోకూడదని ఓ చిన్నమంచం చేయించాడు. రోజూ ప్రొద్దున్నా సాయంకాలం నాపని అయాక దానికి ఓ గంటసేపు హెయిర్ డ్రెసింగ్. దానికి 'సిట్,' 'స్టాండ్' 'గెటౌట్' లాంటి యింగ్లీషుమాటలకి ఏమేం చెయ్యాలో తర్ఫీదు యిచ్చాడు. ఒకకుక్కకీ, మనిషికీ అంత గాఢమైన అనుబంధం ఏర్పడ్డం నా కాశ్చర్యం వేసింది. దానితోనే అతని ఆటలు, అలకలు, కబుర్లు అన్నీ.

జీపు లాండ్‌స్లైడ్ జరిగిన చోట ఆగింది. నాతో వచ్చిన జవానులు టామీని ముద్దు ముద్దుగా పిలుస్తూ అరుస్తున్నారు. కొందరు ఆ రాళ్ళమీద కెక్కి, వాలులోకి దిగి వెతుకుతున్నారు.



ఒకప్రక్క నిట్టనిలువు వాలులో కొండ. మరోవైపు వెయ్యిపైగా అడుగుల లోతునలోయ. మధ్యన సన్నగా రోడ్డు. రాళ్ళతో రోడ్డంతా పూర్తిగా కప్పడిపోయింది. అసలు కనబడ్డంలేదు. పైనుంచి క్రిందదాకా ఒకటే వాలుగా ఉంది.

చీకటి తుంపర పడ్తోంది. క్రిందెక్కడో రాళ్ళని ఒరిసి పరుగెత్తే నీళ్ళ రొద. యీదురుగాలి. నడుంకి తాడు కట్టుకొని, కరంసింగ్ వాలులోకి దిగాడు. క్రిందకి లైట్లువేసి వెలుతురు జేస్తున్నారు మిగతావాళ్లు

పదిరోజు లయింం దేమో! పదిహేను మైళ్ళ దూరంలోనున్న మా కాంప్ నుంచి తిరిగి వస్తున్నాను. జీప్ నేను డ్రైవ్ చేస్తుంటే, రెడ్డి, డ్రైవరు వెనక కూర్చొన్నారు. పైనుంచి రాళ్ళు దొర్లినశబ్ద మయింది. వెంటనే ఆపుజేశాను. రెప్పపాటులో రాళ్ళు దడదడా రోడ్డంతా కురిశాయి. కొన్ని ముక్కలు విండ్‌షీల్డ్‌కి తగిలి ముక్కలు చేశాయి. దిగివచ్చి చూస్తే సుమారు ఓ వందడుగులమేర రోడ్డు మూసుకు పోయింది.

ప్రాణాపాయం తప్పిందన్న సంతో

పంకన్నా ఆ రాత్రివేళ తిన్నగా గూటికి చేరనిచ్చింది గాదన్న నిరాశ యెక్కువైంది. మరోగంటకి అటు నుంచి కొందరు రాళ్ళమీద నడుచుకుంటూ వచ్చారు. వాళ్ళలో మా యూనిట్ వాళ్ళుగూడా ఉన్నారు ఏవో సరుకులు క్రింద కాంప్ కి తీసుకు వెళ్ళుతున్నారు. వాళ్ల ట్రక్ అటు వైపు ఉంది. వాళ్ళని నా జీపులో యిటుపొమ్మని, నేను ఆ రాళ్ళనిదాటి అటు వెళ్ళడానికి నిశ్చయించాను.

ముందు నేను, వెనక రెడ్డి మా ఇద్దరి మధ్యా టామీ. ఉన్నట్టుండి, రెడ్డి అన్నాడు, "సార్, నేను ముందుండి దారి చూపిస్తాను. వెనకాలే ఓ రెండు గజాలదూరముంచి మీరు రండి."

"మరేం ఫర్వాలేదు. దారి నాక్కన బడుతూందిలే."

"అది కాదు సర్! ప్రమాదం జరగొచ్చు. నన్ను ముందుండ నివ్వండి."

"ప్రమాదం నాకేగాని నీకు రాదేమిటోయ్!" నవ్వొచ్చింది.

"నామాట వినండి, సర్. నన్ను ముందుకు వెళ్లనివ్వండి," అంటూ నన్ను తప్పించుకుని ముందుకు నడిచాడు రెడ్డి.

"ప్రమాద మన్నది ముందున్నా వెనకున్నా రావాల్సింది రాక మానదులే."

"అంతే, సార్. నే నెప్పుడెలా చావాలో అప్పుడే నిర్ణయించేసి దేవుడు ఏ గుండుమీదో, ఏ రాయిమీదో నా పేరు రాసేసుంటాడు పాటికి!"

"ఆ మాత్రం తెలిసినవాడివి నా సంగతీ అంతేనని తెలుసుకొని, నన్ను ముందెందుకు పోనివ్వలేదు?"

"అందుకే మనల్ని మనుషులంటారు, సార్!"

ఇంకా రెడ్డిమాట పూర్తి కాకుండానే, మరొకసారి పెద్దచప్పుడు, పెద్ద పెట్టున రాళ్లవర్షం —అన్నీ క్షణంలో జరిగిపోయాయి. తటాలున నేలమీద కొరిగి కూర్చున్నాను. ఒకటి రెండు నిమిషాల తర్వాత శబ్దాలు ఆగాయి. రాళ్ళుపడ్డం ఆగింది. 'టామీ' అరుపు వినబడింది.

"రెడ్డీ, రెడ్డీ," అని పిల్చాను.

జవాబులేదు. ఆత్రుతగా నడిచి అటు వెళ్ళాను. రాంసింగ్ ట్రక్ దగ్గర కనిపించాడు. ఇద్దరం కలిసి రెడ్డికోసం పిలిచాం. ట్రక్ హెడ్ లైట్లు ఫోకస్ చేసి వెతికాం. యెక్కడా పత్తాలేదు.

నేనక్కడే ఉండి, ట్రక్ వెనక్కి పంపాను— రెడ్డి కనబడని సంగతి సుబేదారుతో చెప్పి యూనిట్ నుంచి జవానులతోబాటు పలుగు, పార, తాళ్ళు వగైరా తీసుకురమ్మని. అరగంటలో అంతా జేరారు. నేను స్వయంగా క్రిందికంటూ దిగివెళ్ళి అంతటా వెతికాను. గట్టిగా కేకలుబెట్టి పిలిచాను.

రాత్రంతా ఎంతో ప్రయత్నం చేశాం. ఎక్కడన్నా స్పృహా తప్పి పడున్నా డేమో, ఏ క్షణమయినా స్పృహవస్తే, పిలిస్తే వినబడదేమో! రకరకాల అనుమానాలు, భయాలు పీడిస్తూంటే మొత్తం యూనిట్‌లో అందరం ఆ రాత్రి అక్కడే జాగరణ చేశాం. లాభం లేకపోయింది.

మర్నాడు జడివాన కురిసి దుమ్ము, మట్టి, రాళ్ళు కొట్టుకుపోయాక బయట పడింది రెడ్డిశవం. పైనుంచి సూదిలా మొనతేలిన రాయి నెత్తిమీద పడ్డం మూలాన మూడు అంగుళాల లోతు గాయమైంది. అంతదెబ్బ తగిలితే ప్రాణం వెంటనే పోయుండొచ్చు నని తేల్చాడు డాక్టరు పోస్టుమార్టంలో

నినాదాల ఆకర్షణ యెక్కువగావుండే వయస్సు గాబట్టి చైనా దురాక్రమణ సమయంలో,ఏదో ఆవేశంలో సైన్యంలో జేరినవాడు రెడ్డి. తండ్రి, మంచి మంచి ఉద్యోగాల్లో అన్నలు, కాస్తో, కూస్తో ఆస్తి అన్నీకలవాడు. చివరికిలా చావు రాతపడ్డాడు. ఏవో మామూలు నష్ట పరిహారం వగైరా మాత్రమే కాకుండా యింకేమన్నా సహాయం చేయగలనా అని నేను వ్రాస్తే, అతని తండ్రి, "వాడి అస్థులు బూడిద పంపించండి" అని జవాబిచ్చాడు.

రెడ్డి ఆలోచనలు ముసురుకుంటుంటే, టామీకోసం కరంసింగ్, మిగతావాళ్ళ అన్వేషణమీద నా దృష్టి నిలవలేదు.

"యిదుగో, సార్," అంటూ కరం సింగ్ నా ఆలోచనలకి అంతరాయం కలిగించాడు. కళ్ళుచెమ్మని ఆపలింతలో మాయంచేసి కరంసింగ్ చేతుల్లోకి చూశాను.

టామీ భౌతికకాయం మిగిలింది!

కూడావచ్చిన నలుగురూ చుట్టూ మూగారు.

"రెడ్డి పోయినప్పట్నుంచి తిండి మానేసింది!" అన్నాడు కరంసింగ్.

"కట్టేయకపోతే రోజూ యిక్కడికి పరుగెత్తుకొచ్చి రాళ్లూ, మట్టీ వాసన చూసేది!"

అంతా తలోమాట అంటున్నారు. నాకు మనసంతా వికలమయి, మాటలు సరిగ్గా వినబడడం మానేశాయి.

"దా న్నక్కడ పారేసి, ఇంకరండి పోదాం!" అన్నాను వెనక్కితిరిగి.

"అలా అంటారేం, సార్! మనిషి కన్నా యెక్కువ విశ్వాసం చూపెట్టింది. దీనికి మనలైన్సులో సమాధి గట్టి రోజూ దీపం వెలిగించాలి!" వాళ్ళంతా అన్నారు.

లైన్సుకి తిరిగి వచ్చేశాం.

* * *

బుఖారిలో మంటలు పైకి లేస్తున్నాయి. పాము నాలుకల్లాగ పైకి

లేచే మంటల కొనలవంక తదేకంగా చూస్తూ వొంటిని వేడిచేసుకుంటున్నాను. వొళ్ళు వెచ్చబడ్తోందిగాని మనసులో మంచుముద్ద జేరి అంతకంతకి యెక్కువగా గడ్డజేస్తున్నట్టుంది. ఓల్డ్ స్మగ్లర్ ఓలార్జి పోసుకొని మెల్లిగా రాధ ఉత్తరం తీశాను.

"...మనమధ్య యెంత దూరమో ఆలోచించండి. ఎక్కడో మంచులో కొండల్లో యెన్నో వేల మైళ్ళదూరాన ప్రాణాల్తో చెలగాటమాడుతుంటారు! తల్చుకుంటేనే బాధగా, భయంగా వుంటుంది. మీనుంచి వారానికో ఉత్తరమన్నా కనీసం రాకపోతే, దిక్కుమాలిన మనసు క్షణం విశ్రాంతి నివ్వదు. ఏదో ఒకరోజు శనివారమో, ఆదివారమో గుర్తుపెట్టుకొని తప్పనిసరిగా నాకో ఉత్తరంవ్రాసి పడెయ్యాలి! ఇది నా ప్రార్థన, విన్నపం, వేడికోలు, ఆజ్ఞ - మీ యిష్టం, మీ రెలా తీసుకున్నా సరే!"

నాకు నవ్వొచ్చింది. మెదడులో దళసరి మబ్బుతెరలు దిగసాగాయి. వాటి చాటున వలయాలు తిరుగుతూ రెడ్డి, టామీ, రాధ! రెడ్డిచుట్టూ టామీచుట్టూ రాధచుట్టూ ఎన్నోవలయాలు! కొన్ని కోట్లవలయాలు! అంతా గజిబిజిగా వుంది.

మరో లార్జి పోసుకొని గుటక మింగాను.

